



# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

పేజీలు : 4 వెల రూ.4/-

సంపుటి : 7 సంచిక : 186

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

ఆదివారం 3 డిసెంబరు 2023


## రాజ్‌భవన్‌లో ఘనంగా అస్సాం వ్యవస్థాపక దినోత్సవం



**విజయవాడ,కలంకౌంటర్ :** అస్సాం వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం విజయవాడ రాజ్‌భవన్‌లో ఘనంగా నిర్వహించారు. రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో జరిగిన అస్సాం రాష్ట్ర వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ అస్సాం భారత దేశానికి తూర్పున ఉన్న సెంటినెల్, మంత్ర ముగ్ధులను చేసేలా సుందరమైన ప్రకృతి సౌందర్యంతో, అందమైన పచ్చదనంతో, కొండలు నదుల తో ఆకట్టుకుంటుందన్నారు. అస్సాం తేయాకు తోటలకు, ఒంటి కొమ్ము గల ఖడ్గమృగాలకు ప్రసిద్ధి చెందిందని, ఆధ్యాత్మిక అనుభవాల అద్భుత ప్రపంచాన్ని అందజేస్తుందన్నారు. ముఖ్యంగా కామాఖ్య దేవాలయం అన్నింటికీ కేంద్రంగా ఉందని ఆయన అన్నారు. దేశంలోని ప్రజలందరి మధ్య బలమైన బంధాన్ని పెంపొందించడంతో పాటు వివిధ రాష్ట్రాలు, కేంద్రాల మధ్య పరస్పర అవగాహన పెంపొందించడం లక్ష్యంగా 'ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్' కార్యక్రమంలో భాగంగా అస్సాం రాష్ట్ర వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు గవర్నర్ తెలిపారు. ఈ సందర్భంగా అస్సాం గవర్నర్ గులాబ్ చంద్ కటారియా వీడియో సందేశం ప్లే చేశారు. ఆ తర్వాత విట్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ డాక్టర్ తన్మోయ్ దాస్, విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన అనిష్ సర్కార్, వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీకి చెందిన అంతషా దాస్ ప్రసంగాలు జరిగాయి. గుంటూరు, రాకేష్ పబ్లిక్ స్కూల్ సిమ్స్ కళాశాల విద్యార్థులచే సాంప్రదాయ అస్సామీ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాజ్ భవన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రానికి పూర్వవైభవం తెచ్చే శక్తి ప్రసాదించాలని కోరుకున్నా

- కనకదుర్గమ్మ సేవలో చంద్రబాబు దంపతులు





**విజయవాడ,కలంకౌంటర్ :** తెలుగు ప్రజానీకానికి సేవ చేసి రాష్ట్రానికి పూర్వవైభవం తెచ్చే శక్తి ప్రసాదించాలని కనకదుర్గమ్మను వేడుకున్నట్లు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. తెలుగు ప్రజలు సిరి సంపదలతో, ఆనందంగా జీవించేందుకు వారికి సేవ చేసే అవకాశం అమ్మ వారు ప్రసాదిస్తారని నమ్ముతున్నానన్నారు. విజయవాడ కనకదుర్గమ్మను సతీసమేతంగా చంద్రబాబు ఇవాళ దర్శించుకున్నారు. తొలుత వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ కనకదుర్గమ్మ శక్తి స్వరూపిణి అని అన్నారు. సమాజాన్ని రక్షించి దుష్టుల్ని శిక్షించమని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. మానవ సంకల్పానికి దైవ సహాయం ఎంతో అవసరమనే తొలుత దైవదర్శనాలు చేస్తున్నానన్నారు. విజయవాడకు వచ్చిన చంద్రబాబుకు ఎంపీ కేశినేని నాని, టీడీపీ నేతలు కేశినేని చిన్ని, జనసేన నేత పోతిన మహేష్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, అశోక్‌బాబు, నేతలు దేవినేని ఉమా మహేశ్వర రావు, కొల్లు రవీంద్ర, యార్లగడ్డ వెంకట్రావు, మాగంటి బాబు, బుద్దా వెంకన్న, బోండా ఉమామహేశ్వరరావు తదితరులు స్వాగతం పలికారు.

## తెలుగు ప్రజల ఐక్యతకు కట్టుబడి ఉన్నా

- 2024లో టీడీపీ - జనసేన కలిసి ప్రభుత్వ ఏర్పాటు ఖాయం





**గుంటూరు,కలంకౌంటర్ :** జనసేనాని పవన్ కల్యాణ్ సమక్షంలో శనివారం పలువురు ప్రముఖులు జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలోని జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ వారికి జనసేన కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా స్వాగతం పలికారు. రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, వ్యాపారవేత్త చిక్కాల దొరబాబు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా లారీ ఓనర్ల సంఘం అధ్యక్షుడు, వైసీపీ ట్రేడ్ యూనియన్ నేత దుగ్గన నాగరాజు, డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు కలగా పాల్ పురుషోత్తం తదితరులు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వారితో పాటు వారి అనుచరగణం కూడా జనసేనలో చేరింది.లి ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీ పెట్టినప్పుడు మాట మీద నిలబడకపోవడం వల్ల అవమానాలు ఎదుర్కొన్నామని వెల్లడించారు. జనసేన పార్టీ వ్యవస్థాపక సభ్యుడిగా ఆ విషయంలో ప్రజలకు క్షమాపణ చెబుతున్నానని తెలిపారు. తెలుగు ప్రజల ఐక్యతకు కట్టుబడి ఉన్నానని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. 2014 ఎన్నికల్లో రాష్ట్ర క్షేమం కోసమే పోటీ చేయలేదని

- 2లో






# తుపాను పట్ల అప్రమత్తంగా ఉండండి

● సహాయక చర్యల్లో ఎలాంటి లోటూ రాకూడదు

● అధికారులకు ముఖ్యమంత్రి వైయస్.జగన్ ఆదేశం.



**అమరావతి,కలంకౌంటర్ :** బంగాళాఖాతంలో నెలకొన్న తీవ్రవాయుగుండం తుపానుగా మారుతున్న దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి వైయస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశించారు. తుపాను పరిస్థితులపై అధికారులను అడిగి ముఖ్యమంత్రి వివరాలు తెలుసుకున్నారు. ఈనెల 4 వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని, అది ఉత్తర దిశగా ప్రయాణించే అవకాశాలున్నాయని అధికారులు సీఎంకు తెలియజేశారు. తుపాను పరిస్థితులు నేపథ్యంలో అన్నిరకాల చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. సహాయ పునరావాస కార్యక్రమాలు చేపట్టడానికి ప్రభావిత జిల్లాల కలెక్టర్లు సర్వసన్నద్ధంగా ఉండాలన్నారు. కరెంటు, రవాణా వ్యవస్థలకు అంతరాయాలు ఏర్పడితే వెంటనే వాటిని పునరుద్ధరించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తుపాను ప్రభావం అధికంగా ఉన్న తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట సహాయశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. రక్షిత తాగునీరు, ఆహారం, పాలు శిబిరాల్లో ఏర్పాటు చేసుకోవాలని, ఆరోగ్య శిబిరాలను కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీఎం ఆదేశాల మేరకు 8 జిల్లాలకు ముందస్తుగా ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. తిరుపతి జిల్లాకు రూ.2 కోట్లు, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, ప.గో, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలకు రూ.1 కోటి చొప్పున విడుదలచేశారు.

# ఏపీలో ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ పార్టీ : పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బరాయన్



**విజయవాడ,కలంకౌంటర్ :** విశ్రాంతి తీసుకోవాల్సిన వయసులో పెన్షనర్ల హక్కుల కోసం రాజకీయ పార్టీ పెట్టి పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని విశ్రాంత ఐఏఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం అన్నారు. రాజ్యాంగం అమలు చేసే వ్యక్తులు సరైన వాళ్లు అయితే అందరి హక్కులకు రక్షణ ఉంటుందన్నారు. వ్యవస్థలు సక్రమంగా నడిచినప్పుడు వ్యక్తుల స్వాతంత్ర్యం కాపాడబడుతుందన్నారు. పెన్షనర్ల హక్కులను ప్రస్తుత ప్రభుత్వం కాలరాస్తుందని, విశ్రాంతి తీసుకోవాల్సిన వయసులో రాజకీయ పార్టీ పెట్టి తమ హక్కుల కోసం పోరాడాల్సి వస్తోందని ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బరాయన్ అన్నారు. సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. సకాలంలో పెన్షన్లు అందక విశ్రాంత ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం పోరాడేందుకు ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ పార్టీ ఏర్పాటు చేశామని, రాబోయే ఎన్నికల్లో అన్ని అర్బన్ ప్రాంతాల్లో పెన్షనర్స్ పార్టీ పోటీలో ఉంటుందన్నారు. పెన్షనర్ల హక్కుల కోసం, యువత భవిష్యత్తు కోసం తమ పార్టీ పోరాటం చేస్తుందన్నారు.

# టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ లిటరసీ దినోత్సవం



**కందుకూరు,కలంకౌంటర్ :** టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కందుకూరు నందు ప్రపంచ కంప్యూటర్ లిటరసీ దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం మొత్తం కంప్యూటర్ విభాగానికి చెందిన విద్యార్థుల సమక్షంలో వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. దైనందిక జీవితంలో కంప్యూటర్ యొక్క వినియోగం, సైబర్ సెక్యూరిటీ, ఆన్లైన్ డిజిటల్ మోసాలు, వివిధ రకాల కంప్యూటర్ సర్చ్ ఇంజన్స్ మరియు వాటి యొక్క ఉపయోగం అను అంశాల మీద ఫైనల్ ఇయర్ విద్యార్థులు బి. కౌసల్య, జే. నివాస్, బి. అమృత, అమూల్య, సాయి ప్రణీత్, వెంకటరమణారెడ్డి తదితరులు ఇతర విద్యార్థులకు తెలియజేశారు. కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు డాక్టర్ జె .హనుమంతరావు , టీ హరీష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులని ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ అభినందించారు.

# మాలకొండకు పోటెత్తిన భక్తులు

● శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి ఆదాయం రూ 10,00,098/-లు ● భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈవో పర్యవేక్షణ.



**కందుకూరు,కలంకౌంటర్ :** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాలెం మండలం లోని ప్రముఖ పుణ్యక్షేత్రం మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో కేబి శ్రీనివాసరావు ఏర్పాట్లు స్వయంగా పర్యవేక్షించారు. స్వామివారి ఆదాయం రూ 10,00,098/-లు వచ్చాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి కేబి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజ, అష్టోత్తర నామ పూజ, హోమం నిర్వహించారు. ఆలయంలో 3 వివాహాలు జరిగాయి. .భక్తులు పొంగళ్ళు పెట్టుకుని స్వామివారికి నైవేద్యం సమర్పించారు.భక్తులు అధిక సంఖ్యలో సుదూర ప్రాంతాల నుండి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారని ఆలయ ఈవో కేబి శ్రీనివాసరావు తెలిపారు.

# పార్టీ ఆదేశం కోసం ఎదురు చూపు

● త్వరలో బాపట్ల టీడీపీ క్యాడర్ లో జోష్ నింపనున్న నూతన నాయకుడు ● బాపట్ల పరిసర గ్రామం కకుమాను లో చిరు ప్రాయం,విద్యాభ్యాసం



**పిట్టలవాని పాలెం / బాపట్ల,కలంకౌంటర్ :** బాపట్ల రాజకీయాలు రోజుకు ఒక మలుపు తిరుగుతున్నాయి.ఎన్నో సంవత్సరాలుగా టీడీపీ టికెట్ విషయం చివరి వరకు సందిగ్ధంలో లే నే ఉంటుంది. చివరి నిముషం వరకు అభ్యర్థి ఖరారు లో స్పష్టత అనేది ఉండదు. నరాలు తెగే ఉత్కంఠ. పార్టీ క్యాడర్ ఎవరికి చేయాలి అనే అయోమయం వెరసి కొత్త అభ్యర్థి ఖరారు అవుతున్న సంఘటనలు. ఇది ఇలా ఉంటే గతంలో పార్టీ కష్టం లో ఉన్న సమయం ఎంతో మంది నాయకులు పార్టీ కి ప్రాణం పోసిన సంఘటనలు కోకొల్లలు గా ఉన్నాయి.అయితే పార్టీ గెలుపే ప్రామాణికం గా అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. ఇదే తరహా లో గతకొంత కాలంగా బాపట్లలో కూడాఇదే పరిస్థితి పునరావృతం అవుతుంది. ఇప్పుడు, ఎప్పుడు పార్టీ క్యాడర్ మాత్రం బలంగా ఉంటూ మనోధైర్యం తో పార్టీ హై కమాండ్ ఆదేశించిన వారికి టీడీపీ క్యాడర్ ప్రోత్సాహం అందిస్తూ ఉన్నారు. కానీ అనూహ్య రీతిలో ఇప్పుడు అనేక పేర్లు బాపట్ల అభ్యర్థి పై వినబడుతూ ఉన్నాయి. వీటిలో ఒక పేరు మరెడ్డి శ్రీనివాస రెడ్డి. ఈయన చిన్ననాటి నుండి కాకుమాను మండలం గార్లపాడు గ్రామంలో చిరు ప్రాయం మరియు విద్యాభ్యాసం చేశారు. అంతే కాకుండా క్రీడలలో రాణించి బాపట్ల పరిసరాల్లో ఎన్నో టోర్నమెంట్ లలో పాల్గొని అందరికి సూపరిచితుడుగా ఉన్నారు. బాపట్ల వాసునిగా అందరితో పరిచయాలు, సంబందభాంధవ్యాలు కలిగిన వ్యక్తి. అంతే కాకుండా తన విద్యాభ్యాసం నుండి కమ్యూనిస్టు భావజాలం తో ఎన్నో పోరాటాలు చేసి నాయకునిగా క్రింద స్థాయి నుండి ఆటు పోట్లు ఎదుర్కొని మంచి పేరు గడించారు. పోరాట పటిమ, పేదలంటే ప్రేమ ఇవన్నీ వెరసి ఆయనను జడ్పీటీసీ నుండి రాష్ట్ర రైతు అధ్యక్షులు గా ఎదిగేలా చేసాయి. పార్టీ లో క్రమశిక్షణగా ఉంటూ రైతు పక్షపాతిగా ఎన్నో సమస్యలు పరిష్కారం చేసిన అనుభవం తదితర అంశాలు టీడీపీ అధినేత చంద్రబాబుకు శ్రీనివాస రెడ్డి ని దగ్గర చేసాయి. గత నాలుగు సంవత్సరాలు గా బాబు కు దగ్గరగా ఉంటూ పార్టీ అభివృద్ధి కి తనవంతు తోడ్పాటు అందిస్తూ అధికార పార్టీ కి తలనొప్పిగా మారారు. గత ఎన్నికల్లో నే బాపట్ల అభ్యర్థి పై ఆశలు పెంచుకున్నారు.ఇదే విషయం అధినేత దృష్టిలో కూడా ఉంచారు.అయితే సమయం కోసం చూస్తున్న ఆయనకు బాపట్ల లో తన సామాజిక వర్గం ఎక్కువగా ఉండటం ఇక్కడ అభ్యర్థిగా పోటీ చేస్తే తప్పకుండా పార్టీ గెలుస్తుంది అని ప్రజల భావనలో ఉండటం శ్రీనివాస రెడ్డి కి అనుకూలించే అంశాలు. అనుకున్నదే తడవుగా కొన్ని సూచనలు నిఘా వర్గాలు ద్వారా తెలుసుకున్న టీడీపీ అధినేత రెడ్డి సామాజిక వర్గ నాయకుని అభ్యర్థి గా పరిశీలన చేస్తే బాగుంటుంది అని ఆలోచనలో ఉన్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి.ఎంతో కాలంగా గెలుపు ఎరుగని పార్టీ శ్రీనివాస రెడ్డి రూపంలో గెలుపు సాధించవచ్చు అని కొన్ని విశ్లేషణలు కూడా చెబుతున్నట్లు సమాచారం. చంద్రబాబు నాయుడుకి ప్రియ శిష్యుడిగా ఆయన అజ్ఞాపిస్తే ఎంతటి కష్టమైన ఇష్టంగా చేసే మనస్తత్వం గల మనిషిగా శ్రీనివాస రెడ్డి ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో బాపట్లలో రాజకీయాలలో పెను తుఫాన్ అనేది శ్రీనివాస రెడ్డి రూపంలో వచ్చే అవకాశం మెండుగా ఉంది. ఏది ఏమైనా రాబోవు ఎన్నికలు ఇరు పార్టీలకు కీలకం. అభ్యర్థులు ఖరారు లో ఖరాకండి గా అధిష్టానం నిర్ణయం ఉంటుంది అని విశ్వసనీయవర్గాలు చెబుతున్న సమాచారం. ప్రజల నాడి, అధిష్టానం ఆలోచన ఒకటి అయితే నే గెలుపు తధ్యం. చూడాలి టీడీపీ లో అభ్యర్థి ఎవరు?అనేది ఎన్నికల వరకు తేలేలా లేదు.ఒక వేళ పార్టీ లో అభ్యర్థి మార్పు ఖరారు అయితే ఇంత కాలం కష్టబడిన వేగేసినకు సముచిత స్థానం పార్టీలో కలిపిస్తారు అనేది వాస్తవం. ఎవరికి బి ఫారం ఇస్తారో.......అంటూ ఎదురుచూస్తున్న బాపట్ల ప్రజానీకం.

# మత్స్యకారులు ఎవరు సముద్రంలోకి వేటకు వెళ్లరాదు జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాషా



**బాపట్ల, కలంకౌంటర్ :** జిల్లాలో మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లరాదని బాపట్ల జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా శనివారం హెచ్చరికలు జారీ చేశారు. బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడిందని, 900 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతం అయ్యిందన్నారు. మూడో తేదీ నుంచి 5వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ నుంచి అధికారికంగా సమాచారం అందిందన్నారు. సముద్రంలోకి మత్స్యకారులు వెళ్లరాదని, ఇప్పటికే వేటకు వెళ్లి ఉంటే తక్షణమే బయటకు వచ్చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో కోత దశకు వచ్చిన పంటలన్ని కోతతో తక్షణమే భద్రపరుచుకోవాలన్నారు. లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. ముఖ్యంగా లంక గ్రామాల్లోని ప్రజలు, అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.

# తీవ్ర తుఫాన్ గా మారనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి జిల్లా ఎస్పీ.. వకుల్ జిందాల్

● బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం మరింత బలపడి తీవ్ర తుఫాన్ గా మారనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ● మత్స్యకారులు సముద్రంలోకి వేటకి వెళ్ళవద్దు.. జిల్లా ఎస్పీ ● ఎలాంటి పరిస్థితులనైనా ధీటుగా ఎదుర్కొని సహాయక చర్యలు అందించడానికి ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ బృందాలు సర్వసన్నద్ధం.. జిల్లాఎస్పీ



**బాపట్ల, కలంకౌంటర్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం మరింత బలపడి తీవ్ర తుఫాన్ గా మారనున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. బాపట్లకు ఈశాన్య దిశలో 710 కిలోమీటర్ల దూరంలో బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర వాయుగుండం డిసెంబర్ 3 వ తేదికి తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉంటుందన్నారు. దీని ప్రభావం బాపట్ల జిల్లాపై ఎక్కువగా చూపే అవకాశం ఉన్నందునా సముద్ర తీరం వెంబడి నివసిస్తున్న ప్రజలు పోలీస్, రెవెన్యూ అధికారులు సూచించిన విధంగా సురక్షిత ప్రాంతాలకు లేక తుఫాన్ షెల్టర్ కు వెళ్ళాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని, సముద్ర తీర బీచ్ ల వద్దకు పర్యాటకులు ఎవరు రావద్దని ఎస్పీ హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైన ప్రాంతాలలో సహాయక శిబిరాలు, పునరావాస కేంద్రాలు గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఈదురు గాలులకు రోడ్లపై విరిగిపడే చెట్లను, కరెంట్ స్తంభాలను వెంటనే తొలగించి ప్రయాణాలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చేయడానికి సంబంధిత సామాగ్రి వాహనాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్న నదీ పరీవాహక ప్రాంతాలలో ముమ్మరంగా గస్తీ నిర్వహించాలన్నారు. ప్రయాణించేందుకు అనువుకాని మార్గాలలో, నీట మునిగిన రహదారుల వద్ద పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి రహదారులను మూసివేసి ఇతర మార్గాల ద్వారా వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. లైఫ్ జాకెట్స్, లైఫ్ బాయ్, రొప్స్ లతో పోలీసులు, గజ ఈతగాళ్లను సిద్ధం చేసుకోవాలని, వారిని లోతట్టు ప్రాంతాలలో నియమించాలన్నారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితులను అంచనా వేస్తూ దానికి అనుగుణంగా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులకు సూచించారు. ఆపదలో ఉన్న ప్రజలను రక్షించడానికి పోలీస్ శాఖ ఎప్పుడు సిద్ధంగా వుంటుందని, ఎలాంటి పరిస్థితులనైనా ధీటుగా ఎదుర్కొని సహాయక చర్యలు అందించడానికి ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని, అత్యవసర పరిస్థితులలో తక్షణ సహాయం కొరకు డయల్ 100, 112 (లేదా) పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8333813228 (లేదా) స్థానిక పోలీసు అధికారులకు సమాచారమివ్వాలని జిల్లా ఎస్పీ గారు ప్రజలకు సూచించారు.

# దేవకిని ఘనంగా సన్మానించిన ముప్వల నరసింహులు శెట్టి




వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లను చిత్తూరు జిల్లా కల్లూరు లో తన నివాసమందు స్వయంభు కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పాలక మండలి సభ్యులు ముప్వల నరసింహులు శెట్టి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దేవకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పాలకమండలి సభ్యులు నరసింహులు శెట్టి ఇంట్లో తనని సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. నరసింహులు శెట్టి మాట్లాడుతూ దేవకి అనే ఇంటికి రావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. వరసిద్ధి వినాయకుని ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో ఉండాలని, వాసవి సత్రాలు దినదినాభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం వారు, పీలేరు వేణు తదితరులు పాల్గొన్నారు.

**-రవికుమార్,9346935672**

# వైసీపీలో చేరిన మాజీ కౌన్సిలర్

● సంక్షేమ అభివృద్ధి లో అందరూ భాగస్వామ్యం కావాలి - ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి

● మానుగుంట తోనే అభివృద్ధి సాధ్యం... పాశం పాకనాటయ్య



**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్,సీనియర్ నాయకుడు పాశం పాకనాటయ్య శాసనసభ్యులు మానుగుంట మహీధరరెడ్డి సమక్షంలో వైయస్సార్ కాంగ్రెసు పార్టీ లో చేరారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం అభివృద్ధి కోసం అందరూ భాగస్వామి కావాలని గతంలో నిస్వార్థంగా రాజకీయాలు చేసిన సీనియర్ నాయకులు అంతా కలిసి రావాలని అన్నారు. పాశం పాకనాటయ్య కు పార్టీ కండువాను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా పాశం పాకనాటయ్య స్పందించి కందుకూరు మున్సిపాలిటీ, నియోజకవర్గం శాసనసభ్యులు మానుగుంట మహీధరరెడ్డి నాయకత్వం తోనే అభివృద్ధి సాధ్యం అవుతుంది అని అన్నారు. ఈకార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెసు పార్టీ సీనియర్ నాయకులు పాశం కొండయ్య,కృష్ణ బలిజ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాశం కుమారి, సచివాలయం కన్వీనర్ భోగిశెట్టి దత్తాత్రేయ, పాశం భూపతి, పసుపులేటి దత్తాత్రేయ, జె సి యస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు కిషోర్ తదితరులు పాల్గొన్నారు

# వన సమారాధనను వెల్లంపల్లి అడ్డుకోవడం ద్రోహం - మోదడుగు వెంకటేశ్వర్లు



**కందుకూరు,కలంకౌంటర్ :** ఆర్యవైశ్యులు కార్తీక మాసంలో నిర్వహించుకునే వన సమారాధనను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్ అడ్డుకోవడం ద్రోహం అని కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షులు మోదడుగు వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా విజయవాడలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధనను నిర్వహించుకోవడానికి అన్ని ఏర్పాట్లు పూర్తవుతున్న సమయంలో వన సమారాధనను అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని వెంకటేశ్వర్లు అన్నారు. వెల్లంపల్లి శ్రీనివాస్ నిర్వహించిన కార్తీక వన సమారాధనకు జనం సరిగా రాకపోవడంతో,ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నిర్వహించే న సమారాధనకు కు జనం విపరీతంగా వస్తారని తెలుసుకొని కార్యక్రమాన్ని జరగనివ్వకుండా చేయడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ఇదేమిటని వెల్లంపల్లి ని ప్రశ్నించగా చంద్రబాబు నాయుడు ఆర్యవైశ్యులకు ఏమి చేయలేదని నిందించడం సరికాదని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఉన్నప్పుడు ఆర్యవైశ్యులకు ఎంతో మేలు చేశారని అన్నారు. ఆర్యవైశ్యులను ఐదు సంవత్సరాలు మంత్రిగా కొనసాగించిన ఘనతచంద్రబాబు దేనిని అన్నారు. ఆర్యవైశ్య కుల పెద్ద మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకు నివాళులు అర్పించలేని స్థితిలో మీ నాయకుడు ఉన్నాడని అన్నారు. ఆర్యవైశ్యులపై రాష్ట్రంలో దాడులు జరుగుతుంటే కనీసం పరామర్శించలేని స్థితిలో మీరు ఉన్నారని అన్నారు.వీటిపై మేము చర్చకు సిద్ధమని పిలుపునిచ్చాము. మీకు ధైర్యం ఉంటే ఈ చర్చలో పాల్గొనాలని అన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని అడ్డుకొనిన నీవు ఆర్యవైశ్య ద్రోహిగా చరిత్రలో మిగిలిపోతావు అని అన్నారు.

# శిద్దా సుదీర్ ను ఘనంగా సన్మానించిన ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం



**ఒంగోలు,కలంకౌంటర్ :** మాజీ మంత్రి శిద్దా రాఘవరావు తనయులు టీటీడీ పాలకమండలి సభ్యులు శిద్దా సుధీర్ కుమార్ ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ సెంట్రల్ జోన్ చైర్మన్ గా నియమితులైన సందర్భంగా ఒంగోలు పట్టణంలోని కేబీ రెసిడెన్సి నందు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి జలదంకి వెంకట కృష్ణారావు,మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు, వాసవి క్లబ్ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రెటరీ గార్లపాటి బ్రహ్మానందం శాలువ తో ఘనంగా సన్మానించి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి అనుగ్రహంతో సమాజానికి మరిన్ని సేవలందిస్తూ, రాజకీయంగా ఉన్నతమైన పదవులు అధిరోహించాలని, తండ్రికి తగ్గ తనయుడుగా మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు.

# మైచౌంగ్ తుఫాన్ హెచ్చరిక ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి - పేర్ని నాని, పేర్ని కిట్టు

● మత్స్యకారులు ఎవరు సముద్రంలో వేటకు వెళ్ళరాదు.



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రేపు లేదా ఎల్లుండి తీరం దాటే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీచేసిన నేపథ్యంలో మచిలీపట్నం నియోజకవర్గం ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పేర్ని నాని, కృష్ణమూర్తి, కోరారు. కోస్తాంధ్రలో భారీ వర్షాలు పడే అవకాశం ఉంది కాబట్టి ప్రజలు రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల సముద్రం అల్లకల్లోలంగా ఉంటుంది కాబట్టి మత్స్యకారులు ఎవరు వేటకు వెళ్ళరాదని తెలిపారు. ఒకవేళ ఇప్పటికే ఎవరైనా సముద్రంలో వేటకు వెళ్ళిన వారు ఉంటే వారిని క్షేమంగా తిరిగి తీసుకువచ్చే బాధ్యత అధికారులు, నాయకులు ,కార్యకర్తలు చేపట్టాలని కోరారు. మైచౌంగ్ తుఫాన్ వల్ల తీవ్రంగా ప్రభావితం అయ్యే మండలంలో ప్రత్యేక దృష్టి పెట్టి అధికారులు, నాయకులు, కార్యకర్తలు అందరూ నిరంతరం వారికి అందుబాటులో ఉండాలని కోరారు. మియాచుంగ్ తుఫాను నేపథ్యంలో కృష్ణాజిల్లా మచిలీపట్నం కలెక్టరేట్ లో 08672 - 252572 నంబర్ తో కమాండ్ కంట్రోల్ విభాగం ఏర్పాటు చేశామని,అదే సమయంలో మచిలీపట్నం నగరం తన కార్యాలయంలో 8672227979 మరియు పేర్ని కృష్ణమూర్తి ( కిట్టు ) 9647797979 నెంబర్లకు కాల్ చేసి ప్రజలు ఎవరైనా ఇబ్బంది ఉంటే స్వయంగా నా నెంబర్ తెలియజేయాలని కోరారు.

# దేవతిలకుల కార్తీక వనసమారాధనలో పాల్గొన్న హోంమంత్రి తానేటి వనిత





**కొవ్వూరు,కలంకౌంటర్ :** కొవ్వూరు టౌన్ లోని గోదావరి నది ఒడ్డున ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా దేవతిలకుల వారి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనసమారాధనలో రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంగళవారం కొవ్వూరు టౌన్ లోని శ్రీ అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి పంచాయతన ఆలయం వద్ద ఈ వన సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గాండ్ల తెలికుల, దేవతిలకుల అభివృద్ధి కార్పోరేషన్ చైర్ పర్సన్ సంకిన భవనీ ప్రియ హోంమంత్రికి సాదర స్వాగతం పలికారు.

# బిసిలపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు

● టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్






**పిఠాపురం,కలంకౌంటర్ :** ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులపై అత్యంత దారుణంగా దాడి చేసినవారు టీటీడీ విజిలెన్స్ సిబ్బందిలా లేరని, వైకాపా వీధిరౌడీల్లా ఉన్నారని, కక్షతోనే ఫస్టియర్ విద్యార్థిని చంపేశారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆరోపించారు. టిటిడి విజిలెన్స్ సిబ్బంది దాడితో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకి పాల్పడిన విద్యార్థి జితేంద్రకుమార్ ది ఆత్మహత్య కాదని, ఇది ముమ్మాటికీ వైసీపీ సర్కారు చేసిన హత్య అని లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నేతల అనుచరగణంతో కలిసి విజిలెన్స్ సిబ్బంది హాస్టల్‌లో చేస్తున్న పెత్తనాన్ని ఎదిరించినందుకే జితేంద్ర కుమార్ పై కక్ష కట్టి మరీ అంతం చేశారని ఆరోపించారు. విద్యార్థిపై విజిలెన్స్ సిబ్బంది దాడిచేసి తీవ్రంగా కొడితే కాలేజీ యాజమాన్యం ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. టిటిడి అధికారులు, చైర్మన్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల యాజమాన్యం విద్యార్థి మృతిపై స్పందించకపోవడం అనుమానాలకి తావిస్తోందన్నారు. టిటిడి విజిలెన్స్ సిబ్బంది దాడి వల్ల చనిపోయిన జితేంద్రకుమార్ కుటుంబానికి 50 లక్షలు పరిహారం చెల్లించాలని, కారకులని కఠినంగా శిక్షించాలని, ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో మితిమీరిన వైసీపీ రాజకీయ జోక్యానికి ఫుల్ స్టాప్ పెట్టాలని లోకేష్ డిమాండ్ చేశారు.

**లోకేష్ ను కలిసిన ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు :** పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి ఆలయం సెంటర్ లో ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ అసోసేయేషన్ ప్రతినిధులు యువనేత లోకేషష్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు టీచర్స్, లెక్చరర్లు 4లక్షల మంది ఉన్నాము. అరకొర జీతాలతో జీవనం సాగిస్తున్నాం. మాకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు జారీ చేసి ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి. మాకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు వర్తింపజేయాలి. ప్రతి ప్రైవేటు టీచర్ కు రూ.12వేలు కనీస జీతం ఇప్పించాలి. ప్రైవేటు టీచర్లకు ప్రత్యే కార్పొరేషన్ పెట్టి, నిధి ఏర్పాటు చేసి మరణించిన వారి కుటుంబాలకు బీమా కల్పించాలి. మా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

**నారా లోకేష్ ను కలిసిన పిఠాపురం బిసీ సామాజికవర్గీయులు :** పిఠాపురం హాస్పటల్ వద్ద బిసి సామాజికవర్గీయులు యువనేత లోకేష్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. టీడీపీ పాలనలో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి పిఠాపురం కౌన్సిల్ రూ.70లక్షలు మంజూరుకు తీర్మానం చేసింది. వర్క్ ఆర్డర్ వచ్చేనాటికి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. వైసిపి అధికారంలోకి వచ్చిన వైసీపీ కమ్యూనిటీహాల్ నిర్మాణాన్ని రద్దు చేసింది. వైసీపీ ఎమ్మెల్యే దొరబాబు తన పీఏతో కలిసి కమ్యూనిటీ హాల్ కు కేటాయించిన స్థలాన్ని రూ.2కోట్లకు అమ్మేందుకు ప్రయత్నం చేశారు. దీనిపై మేం ఆందోళన చేయగా ఎమ్మెల్యే, తన పీఏ వెనక్కి తగ్గారు. నియోజకవర్గం వ్యాప్తంగా 1.10లక్షల మంది బీసీలు ఉన్నారు. మీరు అధికారంలోకి వచ్చాక కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు. నారా లోకేష్ స్పందిస్తూరాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక బిసిలను అణచివేయడమే పనిగా పెట్టుకున్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ 10శాతం తగ్గించడంతో 16,500 మంది బిసిలు పదవులకు దూరమయ్యారు. బిసిల కోసం ఖర్చుచేయాలని రూ.75,760 కోట్ల సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించి అన్యాయం చేశారు. టిడిపి అధికారంలోకి వచ్చాక పిఠాపురం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించి పూర్తిచేస్తాం. బిసిలకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని అమల్లోకి తేవడం ద్వారా బిసిలపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# నెల్లూరుకు 580 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉన్న తీవ్ర వాయుగుండం



**విజయవాడ, కలంకౌంటర్ :** ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఈ ఉదయానికి తీవ్ర వాయుగుండంగా మారింది. ప్రస్తుతం ఇది నెల్లూరుకు దక్షిణ ఆగ్నేయంగా 580 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. రాగల 24 గంటల్లో ఇది పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ తుపానుగా బలపడనుంది. ఇది తుపానుగా మారాక ఏపీ తీరం వెంబడే పయనిస్తూ డిసెంబరు 5న నెల్లూరు, మచిలీపట్నం మధ్య తీరం దాటనుంది. డిసెంబరు 3 నుంచి 6 వరకు ఏపీ కోస్తా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) వెల్లడించింది. డిసెంబరు 4, 5 తేదీల్లో కోస్తాంధ్ర, యానాంలో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. రాయలసీమ జిల్లాల్లో డిసెంబరు 2 నుంచి 4 వం-కు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, డిసెంబరు 3న కొన్నిచోట్ల అతి భారీ వర్షాలు పడతాయని వివరించింది. కోస్తా జిల్లాల్లో 70 కి.మీ నుంచి 100 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని ఐఎండీ పేర్కొంది.

# తుఫానుతో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి.

● రానున్న మూడు రోజులు పూర్తి అప్రమత్తంగా ఉండండి ● ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి



**విజయవాడ,కలంకౌంటర్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను దృష్ట్యా ఎలాంటి పరిస్థితులు తలెత్తినా సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని విధాలా సన్నద్ధంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్. జవ హర్ రెడ్డి జిల్లా కలెక్టర్లును ఆదేశించారు.తుఫాను ముందు జాగ్రత్త చర్యలపై శనివారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ అంచనా ప్రకారం సోమవారం నెల్లూరు- మచిలీపట్నాల మధ్య తుఫాను తీరాన్ని దాటే అవకాశం ఉందని అన్నారు.తుఫాను ప్రభావంతో రాష్ట్రంలో ముఖ్యంగా తిరుపతి,నెల్లూరు, ప్రకాశం,బాపట్ల,కృష్ణా,పశ్చిమ గోదావరి,అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి,కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లో రానున్న మూడు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు,మిగతా జిల్లాల్లోను ఒక మాదిరి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. కావున అధికారులు అంతా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని సిఎస్ ఆదేశించారు.రానున్న మూడు రోజులు మత్స్యకారులు ఎవరినీ సముద్రంలోకి చేపల వేటకు వెళ్ళనీయ వద్దని ఒకవేళ ఇప్పటికే ఎవరైనా వెళ్ళి ఉంటే వారు త్వరగా ఒడ్డుకు చేరేలా చూడాలని సిఎస్ జవహర్ రెడ్డి కలెక్టర్లుకు స్పష్టం చేశారు.రైతులు పండించిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి మిల్లులకు చేర్చేలా చూడాలని చెప్పారు. ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా కేంద్రానికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేయనున్నట్టు సిఎస్ పేర్కొన్నారు.జిల్లాల వారీగా ఎంత ధాన్యం ఉంది వెంటనే వివరాలు సేకరించి నివేదిక సమర్పించాలని పౌరసరఫరాల శాఖ కమీషనర్ ను సిఎస్ ఆదేశించారు.అదే విధంగా కోతకోసి పనల పై ఉన్న వారి పంటను ఏవిధంగా కాపాడుకోవాలో కూడా రైతులకు తగిన సూచనలు ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.వివిధ నిత్యావసర సరుకులను జిల్లాల్లో పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని సిఎస్ జవహర్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. ఎక్కడైనా చెట్లు,విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగి రహదారులపై ట్రాఫిక్ కు అంతరాయం కలిగితే వెంటనే వాటిని తొలగించి ట్రాఫిక్ ను పునరుద్ధరణకు అవసరమైన పవర్ షాలు, కట్టర్లు,జెసిబిలు వంటి యంత్రాలు వివిధ పరికరాలను అందుబాటులో ఉంచు కోవాలని ఆర్ అండ్బి, విద్యుత్,టెలికం తదితర శాఖలను ఆయన ఆదేశించారు.ఈ సమావేశంలో వర్చువల్ గా పాల్గొన్న రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మరియు సిసిఎల్ఏ జి.సాయి ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యంగా తీర ప్రాంత జిల్లాల కలెక్టర్లు పూర్తి సన్నద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో ఆర్థిక, వ్యవసాయ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఎస్ఎస్.రావత్,గోపాల కృష్ణ ద్వివేది,పౌరసరఫరా ల శాఖ కమీషనర్ హెచ్.అరుణ్ కుమార్,విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి డా.బిఆర్. అంబేద్కర్,అమరావతి భారత వాతావరణ శాఖ డైరెక్టర్ స్టెల్లా, ఎన్డీఆర్ఎఫ్ అధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : హోంమంత్రి తానేటి వనిత







**కొవ్వూరు,కలంకౌంటర్ :** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. కొవ్వూరు మండలం వేములూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం 173వ రోజు కార్యక్రమాన్ని శనివారం ఆమె నిర్వహించారు. సాయంత్రం వేములూరు దొరయ్య చెరువు వద్ద ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడుతూ వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమాన్ని లెక్కలతో సహా కుటుంబ సభ్యులకు వివరించారు. ఇంటింటికి వెళ్లి జగనన్న అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ అర్హులైన వారు ఎవరైనా వుంటే వారికి ఎవరికైనా పథకాలు రాకుంటే అలాంటి వాటిని పరిష్కరించాలంటూ సచివాలయం ఉద్యోగులను, అన్ని శాఖల అధికారులను హోంమంత్రి తానేటి వనిత ఆదేశించారు. ఈ సందర్భంగా హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ... గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని, ఎక్కడికి వెళ్ళిన కూడా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఎక్కడైనా సాంకేతిక కారణాల వల్ల రాలేని వారికి వాటిని వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు..

# జై భీమ్ భారత్ పార్టీలో చేరిన షేక్ అమ్మృద్దీన్

● బందరు పార్లమెంటు కన్వీనర్ గా నియామకం



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** బిజెపి మాజీ జిల్లా నాయకుడు షేక్ అమ్మృద్దీన్ జై భీమ్ భారత్ పార్టీలో చేరారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జడ శ్రవణ్ కుమార్ సమక్షంలో విజయవాడలోని పార్టీ కార్యాలయంలో కండువా కప్పుకున్నారు. గతంలో అమ్మృద్దీన్ బిజెపి పార్టీలో పలు జిల్లా స్థాయి పదవుల నిర్వహించారు. చేరిన వెంటనే పార్టీలో ఆయనకు తగు గుర్తింపు లభించింది. బందరు పార్లమెంటు నియోజకవర్గం కన్వీనర్ గా ఆయనను శ్రవణ్ కుమార్ నియమించారు. ఈ సందర్భంగా అమ్మృద్దీన్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అసెంబ్లీల వారిగా కన్వీనర్లను నియమించనున్నట్లు తెలిపారు. బడుగు బలహీన వర్గాల వారికి గుర్తింపు ఇస్తుందన్నారు.




Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com